నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, బుధవారం 18 డిసెంబర్ 2024 | HANUMAKONDA

తొర్రూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

అరెస్టులకు భయపడేది లేదు

- పోరాటం మాకు కొత్తమే కాదు..
- రాష్ట్రంలో రేవంత్ స్వీయ రాజ్యాంగం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు/దేవరుప్పుల, డిసెంబర్ 17 : అరెస్టులకు భయపడేది లేదని.. పోరాటం తమకు కొత్తేమీ కాదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దేశంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలులో ఉంటే తెలంగాణలో మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి స్వీయ రాజ్యాంగం అమలవుతున్నదని జరుగుతున్న పరిణామాలు చూస్తే బోధపడుతున్నదని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ రాజ్యాంగం బుక్ పట్టుకుని కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తుంటే తెలంగాణలో రేవంత్ పాలన రాజ్యాంగానికి విరుద్ధంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. జనగామ జిల్లా దేవరుప్పులలో అంబేద్కర్ విగ్రహం వద్ద, మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే రాజ్యాంగాన్ని పక్కబెట్టి, తాను స్వయంగా రచించిన రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. వేయి అబద్ధాలాడి వేగంగా సీఎం అయిన రేవంత్‌రెడ్డి, అంతే వేగంగా అధికారం కోల్పోవడం ఖాయన్నారు. లగచర్లలో రాజ్యాంగబద్ధంగా తమ భూముల కోసం ధర్నా చేస్తున్న గిరిజన రైతులపై అక్రమ కేసులు బనాయించి జైలులో వేయించడం, జైల్లో గుండెపోటు వస్తే చేతులకు బేడీలు వేసి దవాఖానకు తరలించడంతో పాటు స్వయాన సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకుని తన చావుకు రేవంత్‌రెడ్డి బ్రదర్స్ కారణమని మరణ వాంగ్మూలంలో రాసినా కనీస చర్యలు లేకపోవడం, అల్లు అర్జున్‌ను జైల్లో వేసి బెయిల్ వచ్చినా విడుదల చేయకపోవడం.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు.. ఇవన్నీ రాజ్యాంగ విరుద్ధమని.. రేవంత్‌రెడ్డి స్వీయ రాజ్యాంగం అమలుకు సాక్ష్యాలని వివరించారు. రాష్ట్రంలోని హాస్టళ్లలో కల్తీ ఆహారం తిని ఎంతోమంది విద్యార్థులు చనిపోతున్నారని వీటన్నిటికీ కారణమైన సీఎం రేవంత్‌రెడ్డిపైనే కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు అరెస్ట్ అయితరని బెదిరిస్తున్నాడని కానీ ఓటుకు నోటు కేసులో అరెస్ట్ అయింది రేవంత్‌రెడ్డేనని గుర్తుచేశారు. జమిలి బిల్లు పాసై అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జమిలి ఎన్నికలను స్వాగతిస్తామన్నారు.

సర్పంచ్‌లు బిల్లులడిగితే అరెస్టులా ?

సర్పంచ్‌లు తమ బేబుల నుంచి డబ్బులు ఖర్చు పెట్టి పనులు చేస్తే వారికి నిధులు కేటాయించకుండా వేధిస్తున్నారని, తమ బాధలు చెప్పుకోవడానికి చలో అసెంబ్లీకి పిలుపునిస్తే ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి కేసులు పెడతున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి నెలకు రూ. 270 కోట్లు కేటాయించిందని, రేవంత్‌రెడ్డి పాలనలో ఒక్క పైసా విడుదల కాలేదన్నారు. మాజీ సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించాలని, అలాగే లగచర్ల బాధితులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పాలకుర్తిలో అదే పాలన

పాలకుర్తి నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి స్వీయ రాజ్యాంగాన్నే అమలు చేస్తున్నారని, పోలీసులతో అక్రమ కేసు పెట్టించి జైలు పాలు చేస్తున్నారని ఎర్రబెల్లి మండిపడ్డారు. దేవరుప్పుల మండలం చినమడూరు ఘటన అందుకు సాక్ష్యమని చెప్పారు. బాధితులను నేరుగా పోలీసుల ముందు హాజరుపరచి, దోషులెవరో తేల్చినా కనీసం కేసులు పెట్టడం లేదన్నారు. ఇక పాలకుర్తి, కొండాపురం తండాలో పోలీసుల చర్యలకు నిరసనగా పోలీస్‌స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో బాధ్యులను నేటికీ అరెస్ట్ చేయకపోవడం వెనుక ఎవరి హస్తం ఉన్నదని ప్రశ్నించారు. పాలకుర్తిలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, తాగు, సాగునీటికి కటకట వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్లు, వంద పడకల దవాఖాన, బమ్మెర, వల్మిడి, పాలకుర్తి టూరిజం కారిడార్ పనులు నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిన్నఅంజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సీతారాములు, నలమాస ప్రమోద్, నాయకులు అంకూస్, కాలునాయక్, జనార్దన్ రాజ్, కడెం యాకయ్య, వీరారెడ్డి, రాయశెట్టి వెంకన్న, లేగల వెంకటరెడ్డి, భూసాని ఉప్పలయ్య, మయూరి వెంకన్న, విజయ్‌కుమార్, బొలగాని శీను, ధర్మారపు కిరణ్, పినాకపాణి, మంగళపల్లి వినయ్, మేరుగు ప్రకాశ్, కళావతి, విజయ, లలిత, జాటోత్ సురేశ్, రమేశ్‌నాయక్, అరుణ్ నాయక్, బొలగాని వెంకన్న, కొండ వెంకన్న, పయ్యావుల రామ్మూర్తి, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

నెల్లికుదురులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందచేస్తున్న మానుకోట మాజీ ఎమ్మెల్యే బాపోత్ శంకర్ నాయక్

కురవి: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కాశీబుగ్గ : అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చిన అనంతరం కార్పొరేటర్లు, నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని

హనుమకొండలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, నినాదాలు చేస్తున్న నాయకులు

అన్నదాతకు సంకెళ్లా..?

- ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలి
- సీఎం మొండి వైఖరిని మార్చుకోవాలి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
- అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు వినతులు

లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

'దేశానికి అన్నం పెట్టే రైతన్న చేతులకు సంకెళ్లు వేస్తారా? జైలులో నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా? లగచర్ల గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి.. అన్నదాతలను బేషరతుగా విడుదల చేయాలి' అంటూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల తన మొండి వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దురహంకారం, దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులు, బహుజనులపై అరాచకాలు, బెదిరింపులు పెరిగిపోయాయని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళ వారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు వినతి పత్రాలు సమర్పించారు.

-నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 17

హనుమకొండలో సంకెళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకుడు

ములుగులో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

వర్ధన్నపేటలో..

జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వినతిపత్రం ఇచ్చారు. లగచర్ల గిరిజనులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లోని విగ్రహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఇతర నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. దేశానికి అన్నం పెట్టే రైతులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని, అన్నదాతలను కాంగ్రెస్ సర్కారు నిలువునా ముంచుతున్నదన్నారు. కాశీబుగ్గ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శ్రేణులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. రైతుల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టేందుకు వారు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఫార్మా కంపెనీలకు భూములు ఇవ్వమన్న రైతులను సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, వాళ్లేమైనా కరుడుగట్టిన తీవ్రవాదులా? బేడీలెలా వేస్తావంటూ మండిపడ్డారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తున్నదని విమర్శించారు.

పాలకుర్తి : అంబేద్కర్ చిత్ర పటానికి వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

నర్సంపేట : అంబేద్కర్ సెంటర్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కృష్ణకాలనీ : భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

పాకాలలో త్వరలో బోటు షికారు

పాకాలలో ఏర్పాటు చేసిన బోటింగ్ పాయింట్, (ఇన్‌సెట్) ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

ఖానాపురం, డిసెంబర్ 17 : పాకాల సరస్సులో త్వరలో బోటు షికారు ప్రారంభం కానున్నది. పాకాల తుంగబంధం తూము పక్కనే అటవీ శాఖ రూ.50 లక్షలతో బోటింగ్ పాయింట్ ఏర్పాటుచేసింది. రెండు బోట్లను(స్పీడ్, షేరింగ్) తెప్పించి కొద్ది రోజులుగా ఎఫ్ ఆర్వో రవికిరణ్ ఆధ్వర్యంలో సరస్సులో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. పనులన్నీ పూర్తి కావడంతో ఈ నెల 25లోపు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి చేతుల మీదుగా బోటింగ్ ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా అటవీ, పర్యాటక శాఖల మధ్య ఆర్థిక పరమైన వివాదం కారణంగా బోటింగ్ సేవలు నిలిచిపోయాయి. ఎట్టకేలకు ప్రారంభం కానుండడంతో పర్యాటకుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. అలాగే త్వరలో జిప్‌లైన్ పనులను సైతం చేపట్టనన్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

కొత్త ఇళ్లకు నల్లా కనెక్షన్ ఇవ్వాలి

- విద్య, వైద్యంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి సారించాలి
- శాసనమండలిలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 17 : ప్రభుత్వం కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు నల్లా కనెక్షన్ ఇవ్వాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు కోరారు. మంగళవారం ఆయన శాసనమండలిలో మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకం ద్వారా పూర్తిగా నీటి ఎద్దడిని నివారించారన్నారు. ప్రధానంగా ములుగు, మహబూబాబాద్ వంటి గిరిజన ప్రాంతాల్లో తాగునీటి కోసం బోర్లు, బావులపైన ఆధారపడడంతో విద్యుత్ లేనప్పుడు తీవ్ర సమస్య ఏర్పడేదన్నారు. కేసీఆర్ ముందు చూపుతో కొండలు, ఎత్తైన ప్రదేశాల్లో వాటర్ ట్యాంకులు నిర్మించి కరెంట్ లేకున్నా నీరు వచ్చేలా తీర్చిదిద్దారన్నారు. 2021లో 100 శాతం నల్లా కనెక్షన్లు ఇచ్చిన రికార్డ్ మిషన్ భగీరథకు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నూతన ఇండ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందని, దీనివల్ల మళ్లీ నీటి ఎద్దడి పెరుగుతున్నదన్నారు. నీటి ఎద్దడి నివారణకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఏమైనా నిధులు వచ్చాయా? రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నదా? అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు విద్య, వైద్యం ప్రధానమైందని, గత కేసీఆర్ ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' ద్వారా అనేక ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి కార్పొరేట్ విద్యను అందించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తున్నదా? అని అడిగారు. ఆరు నెలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని, టీచర్లు, డీఈవోలు, ఎంఈవోల కొరత ఉందన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న అయ్యప్పస్వాములు

యూనిఫాంతో స్కూల్‌కు రా.. లేదంటే లీవ్ తీసుకో

అయ్యప్ప మాల ధరించిన విద్యార్థితో ప్రిన్సిపాల్

నెక్కొండ, డిసెంబర్ 17: యూనిఫాంతో స్కూల్ కు రా.. లేదంటే లీవ్ తీసుకొమ్మని అయ్యప్ప మాల ధరించిన నా లుగో తరగతి విద్యార్థికి ప్రిన్సిపాల్ చెప్పడంతో పాఠశాల డ్రెస్ ధరిస్తూ ముగిశాక అయ్యప్ప దుస్తులు ధరిస్తూ ఇబ్బందులు పడుతున్న వైనం నెక్కొండ మండలంలో వెలుగుచూసింది. నెల రోజులుగా ఇలాగే జరుగగా మం గళవారం అయ్యప్ప మాల ధరించిన విద్యార్థి వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సాయిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మోదుగుల రుద్రశేఖర్ తన కుమారుడు జ్యోతేందర్‌ను రెడ్లవాడ గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో చదివిస్తున్నాడు. తండ్రితోపాటు జ్యోతేందర్ అయ్యప్పమాల ధరించాడు. అయ్యప్ప డ్రెస్‌తో పాఠశాలకు హాజరయ్యేందుకు అనుమతించమని, మాలధారణ పూర్తయ్యేవరకు సెలవు తీసుకోవాలంటూ ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు తెలిపాడు. దీంతో విద్యార్థి పాఠశాల డ్రెస్ కోడ్‌తో వెళ్తూ ముగిసిన తర్వాత అయ్యప్ప డ్రెస్‌తో ఉంటున్నాడు. ఈ విద్యార్థికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వెలుగు చూడడంతో మాలధారులు పాఠశాలకు చేరుకొని అయ్యప్ప డ్రెస్‌తో పాఠశాలకు వస్తే ఇబ్బందేమిటంటూ ప్రిన్సిపాల్ చేరాలును ప్రశ్నించారు. డ్రెస్‌కోడ్‌తో విద్యార్థి పాఠశాలకు నెలరోజులనుంచి హాజరవుతున్నారని, తల్లిదండ్రులు సైతం సమ్మతించారని ప్రిన్సిపాల్ చెప్పారు. తమ కుమారుడు అయ్యప్ప మాల ధరించి నెలరోజులవుతున్నదని, స్కూల్ డ్రెస్‌తోనే హాజరు కావాలని ప్రిన్సిపాల్ చెప్పినట్లు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు.

దోపిడీకి అడ్డాలుగా..

లింగాలఘనపురం మండలం నెల్లుట్లలోని సత్యసాయి కాటన్ ఇండస్ట్రీస్‌లో రూ.6 వేల నుంచి రూ.6,200కు మాత్రమే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. పైగా 2శాతం కమీషన్, అన్‌లోడింగ్ చార్జీల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. పత్తి మిల్లుల నిర్వాహకులు, ప్రైవేట్ వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి దోపిడీ చేస్తున్నారు. జనగామ మార్కెట్ పరిధిలో ఐదు, స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ పరిధిలో రెండు, కొడకండ్ల మార్కెట్ పరిధిలో ఏర్పాటు చేసిన మూడు కొనుగోలు కేంద్రాల్లో అసలు రైతుల సరుకు నామమాత్రంగా కొని, బినామీ రైతుల పేర్లతో దళారులు తెచ్చిన పత్తిని కొంటున్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ మినహా సీసీఐ కొనుగోలు కేంద్రాలను జిల్లాలోని ప్రైవేట్ కాటన్, జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేశారు. ప్రైవేట్ మిల్లుల్లోనే ఒకవైపు సీసీఐ, మరోవైపు ప్రైవేటు కొనుగోళ్లు జరుగుతుండగా, తేమ సాకుతో సీసీఐ పత్తి కొనుగోలుకు నిరాకరిస్తున్నది. దీంతో రవాణా ఖర్చు భారంగా భావిస్తున్న రైతులు వేరేచోటకు తరలించలేక అనివార్యంగా పక్కనే ఉన్న ప్రైవేట్ వ్యాపారులు అడిగిన ధరకు అమ్ముకుంటుంటుండగా, అదే పత్తిని రైతుల పేరిట సీసీఐకి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా కేంద్రాల్లోని సీసీఐ పర్చేజింగ్ అధికారులతో దళారులు, మిల్లర్లు, వ్యాపారులు ముందస్తు ఒప్పందాలు చేసుకుంటూ రైతులను దోచుకుంటున్నారు. జిల్లాలో 10 ప్రాంతాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. ఐదారు కేంద్రాల్లోనే పూర్తిస్థాయిలో క్రయ విక్రయాలు జరుగుతుండగా, మిగిలిన కేంద్రాల్లో క్వింటాల్ పత్తి కూడా కొనుగోలు చేయలేదు. కాగా, జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా 20 లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

నెల్లుట్లలోని సీసీఐ కొనుగోలు కేంద్రం బయట బారులు తీరిన పత్తి వాహనాలు

సీసీఐ ఛీటింగ్

- ప్రైవేట్ వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు
- తేమ పేరుతో పత్తి కొనుగోలుకు నిరాకరణ
- అనివార్యంగా దళారులకు తక్కువ ధరకు విక్రయం
- రైతుల పేరుతో అదే పత్తి సీసీఐకి అమ్మకం
- జనగామ జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో గోల్‌మాల్
- నిండా మునుగుతున్న అన్నదాత

జనగామ, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లాలో దళారుల చేతిలో పత్తి రైతు చిత్తవుతున్నాడు. రెక్కలు ముక్కలు చేసుకొని పంట పండించిన అన్నదాత అడుగడుగునా వంచనకు గురవుతున్నాడు. ఒకపక్క తేమ పేరుతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు కొనుగోళ్లను నిరాకరిస్తుండగా, అదే పత్తిని జిన్నింగ్, కాటన్ మిల్లుల నిర్వాహకులు, మధ్య దళారులు తక్కువ ధరకు కొని తిరిగి రైతుల పేరిట సీసీఐకే అమ్ముతున్నారు. మరోపక్క గ్రామాల్లో రైతుల నుంచి తక్కువ ధరకు నేరుగా కొంటున్న దళారులు.. వారి పేరిటే సీసీఐలో మద్దతు ధరకు విక్రయిస్తున్నారు. తమకు తెలిసిన రైతుల పట్టాపాస్ బుక్కులు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయిస్తున్నారు. ఇదంతా మార్కెటింగ్‌శాఖ అధికారులు, మార్కెట్ సిబ్బందికి తెలిసే జరుగుతున్నది. రైతులు తీసుకొచ్చిన పత్తిని కొనేందుకు సవాలక్ష సాకులు చూపుతున్న సీసీఐ అధికారులు మిల్లర్లు, దళారులు తెస్తున్న అదే పంటను కొనుగోలు చేస్తుండడాన్ని చూస్తే ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కై ఛీటింగ్ చేస్తున్నట్లు స్పష్టమవుతున్నది. ఇప్పటి వరకు సీసీఐకి అమ్మిన పత్తి నిల్వల్లో సగానికంటే ఎక్కువ పంట పండించని రైతుల పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు కావడం గమనార్హం. పత్తి రైతులకు మంచి ధర అందించాలన్న ఉద్దేశంతో జిల్లాలో 10 ప్రాంతాల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసింది. అయితే అధికారుల అండతో దళారులు కొత్త ఎత్తులతో రైతులను చిత్తు చేస్తూనే ఉన్నారు.

తేమ పేరుతో ధర తగ్గింపు..

కేంద్ర ప్రభుత్వం 8 శాతం తేమ ఉన్న ఎ-గ్రేడ్ పత్తి క్వింటాల్‌కు రూ.7,521, 9 నుంచి 12 శాతం వరకుంటే ఒక్కో శాతానికి రూ.75 తక్కువగా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ధాన్యం మాదిరిగా పత్తి ఆరబెట్టుకునే పరిస్థితి ఉండదు. మార్కెట్‌కు తీసుకొస్తే అమ్ముకొని ఇంటికి పోవాల్సిందే. ఒకసారి మార్కెట్‌కు తెచ్చిన పత్తిని తిరిగి తీసుకుపోవాలంటే రవాణా ఖర్చు తడిసి మోపెడవుతుంది. దీంతో తేమ, పత్తి నల్లబారిందనే సాకుతో ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు రూ. 1,000 నుంచి రూ. 2 వేలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు తూకంలోనూ మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలకు సంబంధించి రిమోట్‌ను జేబులో పెట్టుకొని రైతులకు తెలియకుండా ఒక్కో బస్తాకు 5 నుంచి 10 కిలోలు తక్కువ చూపిస్తున్నారు. అలాగే పత్తి నాణ్యంగా ఉన్నప్పటికీ యంత్రాల మాయాజాలంతో తేమను ఎక్కువ చూపిస్తున్నారు. అటు తేమ, ఇటు ధరలతో పాటు తూకంలోనూ మోసం చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు.